నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 22 మార్చి 2025 | NALGONDA

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి

రజతోత్సవ సభను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి, పైళ్ల, గాదరి భేటీ

యాదాద్రి భువనగిరి, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ రజతోత్సవ సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని మాజీ ముఖ్య మంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. వరంగల్‌లో నిర్వహించనున్న సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిలి రావాలని సూచించారు. రజతోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సన్నాహక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేసీఆర్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి శుక్రవారం ఎర్రవెల్లిలోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై పార్టీ అధినేత నాలుగు నియోజకవర్గాల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశం ఉంటుందని తెలిపినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా కేసీఆర్ అన్నట్లు జిల్లా నేతలు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు.

నల్లగొండలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

నల్లగొండ రూరల్/సూర్యాపేట అర్బన్, మార్చి 21 : పదో తరగతి వార్షిక పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సజావుగా ప్రారంభమయ్యాయి. నల్లగొండ జిల్లావ్యాప్తంగా 105 కేంద్రాల్లో తొలి రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు 18,511 మంది విద్యార్థులకు గానూ 18,471 మంది హాజరయ్యారు. గుర్రంపోడ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సెంటర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, శాలిగౌరారం మండల కేంద్రంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. శాలిగౌరారంలో పేపర్ లీక్ అయిందనే వార్త అవాస్తవమని ఆర్డీఓ స్పష్టం చేశారు.

సూర్యాపేట జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలల్లో 11,904 మందికి గానూ 11,882 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు, ప్రత్యేక స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8,627 మంది విద్యార్థులకు గానూ 8,616 మంది హాజరయ్యారు.

శివన్నగూడెం ప్రాజెక్టు పనుల అడ్డగింత

- ప్లాట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని నిర్వాసితుల ఆందోళన

మర్రిగూడ, మార్చి 21 : మండలంలోని నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు శుక్రవారం శివన్నగూడెం ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గ్రామంలో ఇంకా 32మందికి ప్లాట్లు, 15మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి 25 నాటికి సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు నెల రోజులు కావస్తున్నా ప్లాట్లులు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమని బైటాయించారు. ఇరిగేషన్ డీఈ ఖాసిం, ఎస్ఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడ రూరల్, మార్చి 21: మండల పరిధిలోని గుడిబండ, అడ్లూరు గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల: మండలంలోని ముకుందాపురంలో 11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు పనులు జరుగుతున్నందున సోమవరం, కల్లూరు ఫీడర్ల పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

రామన్న రాకతో నయా జోష్

బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

సబ్బండ వర్గాల నుంచి విశేష స్పందన రావడంపై హర్షం

- సభ్యత్వ నమోదు.. కొత్త కమిటీలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టత
- కార్యకర్తల కృషిని అభినందించడంపై సంతోషం
- కేటీఆర్ దిశానిర్దేశం అద్భుతమంటున్న సీనియర్ నాయకులు

సూర్యాపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశం గ్రాండ్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. వాస్తవానికి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తలతోనే సమావేశం అని ప్రకటించగా.. రైతులు, యువత పెద్ద సంఖ్యలో రావడంతో అది బహిరంగ సభను తలపించింది. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంతోపాటు చుట్టూ వేలాది మంది కనిపించారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని చెప్తూనే నూతన కమిటీలపై సమావేశం వేదిక పైనుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. పని చేసేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, అంకితభావం, నిబద్ధతతో పని చేసే వారికి పెద్దపీట ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలో అందరం సమానమే నంటూ ఈ ఏడాది మనకు పోరాట నామ సంవత్సరం అని ప్రకటించడంతో కేడర్ సమరోత్సాహంతో ఉంది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన విషయం విదితమే. ప్రధానంగా ఈ సభతో ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను బహిర్గతం చేశారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ జరిగినంత దూరం పెద్దఎత్తున జనం జేజేలు పలకడం తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. ముఖ్య కార్యకర్తల సమావేశం అంటే వరంగల్ సభకు గ్రామాల వారీగా, నియోజకవర్గానికి ఇంతమంది రావాలని నాలుగు ముచ్చట్లు చెప్పి వెళ్తారనుకుంటే ఊహించిన దానికి భిన్నంగా పార్టీ శ్రేణుల్లో మనోధైర్యం నింపారని పార్టీలో తొలి నాళ్ల నుంచి ఉంటున్న ఓ సీనియర్ నాయకుడు హర్షం వ్యక్తంచేశారు.

గురువారం నాటి సూర్యాపేట ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న గులాబీ శ్రేణులు, అభిమానులు

బీఆర్ఎస్ పార్టీ 25 వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రజతోత్సవాల ప్రారంభ సూచికగా వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన సభ సక్సెస్ కోసం గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. కేవలం పార్టీ జిల్లా స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం అనుకుని ఆహ్వానం కూడా వారికే పంపారు. కానీ, అనూహ్య రీతిలో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండి గోస తీస్తున్న రైతులతోపాటు యువతీయువకులు వేలాదిగా తరలిరావడం గులాబీ శ్రేణుల్లో మరింత జోష్‌ను నింపింది. జనగామ క్రాస్‌రోడ్ నుంచి బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం వరకు దాదాపు 10వేల బైక్‌లతో సాగిన భారీ బైక్ ర్యాలీలో రోడ్డుకు ఇరువైపులా, మిద్దెలపైనా జనం నిలబడి కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి చేతులు ఊపడం.. మళ్లీ బీఆర్ఎస్ రావాలని ఆకాంక్షించడం విశేషం. 'సూర్యాపేటలో కార్యకర్తల సమావేశానికి వస్తే 5 కిలోమీటర్ల ర్యాలీలో ఎక్కడికక్కడ ప్రజలు బారులుదీరి... ఎన్నికల రోడ్‌షో మాదిరిగా చేతులు ఊపుతూ.. మళ్లీ మీరే వస్తారు.. తప్పకుండా గెలవాలి అని ఆశీర్వదించారు. 15 నెలలు తిరుగకుండానే ఈ పరిస్థితి వచ్చిందంటే అది కార్యకర్తల పోరాట పటిమ. రేపు స్థానిక సంస్థలు కావచ్చు.. ఉప ఎన్నికలు కావచ్చు.. రాబోయే శాసనసభ ఎన్నికలు కావచ్చు.. అన్నింటిలోనూ తిరిగి గులాబీ జెండా ఎగురాలి అంటే ప్రతీ కార్యకర్త ఒక కేసీఆర్‌లాగా కథనాయకులై ఉద్యమించాలి' అంటూ కేటీఆర్ ఇచ్చిన ఉత్తేజభరితమైన ప్రసంగం బీఆర్ఎస్ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది.

– సూర్యాపేట, మార్చి 21 (నమస్తే తెలంగాణ)

ఆకట్టుకున్న కేటీఆర్ ప్రసంగం

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగంలో పార్టీ పుట్టుక నుంచి ఇప్పటి వరకు జరిగిన కీలక ఘట్టాలు, పదేండ్ల బీఆర్ఎస్ పాలన చేసిన అద్భుతాలను వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, బీఆర్ఎస్‌పై కోపంతోనే రైతుల పంటలను ఎండబెడుతున్న తీరుపై విమర్శలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పవర్‌పుల్ పంచ్ డైలాగులు విసిరారు. సర్కారు వైఫల్యాలను ఎండగట్టిన తీరు శ్రేణులను ఎంతగానో ఆకట్టుకుంది. సీమాంధ్ర నేతలు, వారి మోచేతి నీళ్ల కోసం ఆశపడ్డ ఈ ప్రాంత తొత్తులు కొందరు తెలంగాణ నడిబొడ్డున కూర్చుని తెలంగాణ అనే పదాన్ని నిషేధించిన రోజుల్లో కేసీఆర్ ఒక్కడుగా టీఆర్ఎస్ స్థాపించి లక్షలాదిని జమచేసి ప్రపంచానికి తెలంగాణ గడ్డ ఉందని చాటి చెప్పిందంటూ వివరిస్తున్న సమయంలో అంతా పిన్‌డ్రాప్ సైలెంట్‌గా విన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి అసమర్థులు అంటూ విమర్శలు గుప్పించారు. వారి అసమర్థతతోనే పంటలు ఎండుతున్నాయని ధ్వజమెత్తడంతో అక్కడకు వచ్చిన రైతాంగం చప్పట్లు కొడుతూ కాంగ్రెస్‌కు శాపనార్థాలు పెట్టడం కనిపించింది. అబద్దాల పునాదులపై నిలబడి కొంతమంది విష ప్రచారాలు చేయడం, మోసపూరిత వాగ్దానాలతో ప్రజల్లో లేనిపోని ఆశలు కల్పించడంతోనే ఓటమి పాలయ్యాం తప్ప మనం బాగా చేయలేదనేది జనం అనుకోలేదని,

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో జనమంతా మనవైపే చూస్తున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. అంతకుముందు సూర్యాపేట పట్టణంలో జరిగిన ర్యాలీనే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ర్యాలీ జరిగిన తీరు.. జనం నుంచి వచ్చిన స్పందన.. చూపించిన అభిమానంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇలా అనేక విషయాలపై మాట్లాడుతూ ఇది మనకు పోరాట నామ సంవత్సరం అంటూ పార్టీ సంస్థాగత నిర్మాణంపై స్పష్టత ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కనిపించింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు వేస్తామని, జిల్లా కార్యాలయాలను చైతన్య కేంద్రాలుగా మార్చి క్యాడర్‌కు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం పోయిన తరువాత కొంతమంది నాయకులు పోయారని, ఆ ఖాళీలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నిబద్ధత, అంకిత భావంతో పని చేసే వారికి పెద్దపీట వేస్తానమంటూ పార్టీలో అందరమూ సమానమేనని ప్రకటించడం మరింత విశ్వాసాన్ని నింపిందని సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పెద్దఎత్తున పంటలు ఎండిపోతుంటే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పొలాల్లో పర్యటిస్తూ రైతుల్లో మనోధైర్యం నింపుతున్న ఫలితం మీటింగులో కనిపించిందని, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్ చేస్తున్న కృషి అభినందనీయం కేటీఆర్ వ్యాఖ్యానించడంతో ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చిన క్యాడర్ ఈలలు వేసింది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక సార్లు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ సభలు జరుగాయి. ఎన్నికల సమయాల్లో ప్రచార సభలు జరిగాయి. కానీ ప్రతిపక్షంలో ఉండి అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే బీఆర్ఎస్ పార్టీ పటిష్టానికి కేటీఆర్ చేసిన దిశానిర్దేశం అద్భుతమని సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అన్నదాతకు దక్కని మద్దతు

మిర్యాలగూడలో మిలర్ల సిండికేట్ దందా

- మద్దతు ధర కంటే తక్కువకు సన్నాల కొనుగోలు
- తేమ, తాలు పేరుతో వేధింపులు
- పట్టించుకోని అధికారులు
- ఐకేపీలో రూ.2,820 ఉంటే.. మిల్లుల్లో రూ.2,300 నుంచి 2,400 మధ్యే
- దిగుబడి మొదలైందే ఇప్పుడు..
- కోతలు ఊపందుకుంటే పరిస్థితి ఏంటంటున్న రైతులు

మిర్యాలగూడ, మార్చి 21 : వేలకు వేలు పెట్టుబడి పోసి, అష్టకష్టాలు పడి సాగు చేసిన పంట చేతికి వచ్చినా అన్నదాతకు మార్కెట్‌లో 'మద్దతు' దక్కడం లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుతోపాటు నాన్‌ఆయకట్టులో బోర్ల ఆధారంగా ముందుగా నాట్లు పెట్టిన సన్న రకం వరి వంగడాల కోతలు మొదలయ్యాయి. మిర్యాలగూడలో రైస్ మిల్లులు అధికంగా ఉండడంతో నాలుగైదు రోజుల నుంచి కోసిన సన్న వడ్లను రైతులు ఇక్కడికి తీసుకువస్తున్నారు. కానీ, మిల్లర్లు మాత్రం తేమ, తాలు పేరు చెప్పి రైతులకు నరకం చూపిస్తున్నారు. నానా సాకులతో వడ్లు కొనుగోలు చేయకుండా రైతులను తిప్పి పంపుతున్నారు. ఒక్కో రైతు పది నుంచి 15 మిల్లులకు తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. ఎవరైనా ముందుకువచ్చినా తక్కువ ధరకు అడుతున్నారు. మిల్లర్లు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యానికి రూ.2320 మద్దతు ధర, అదనంగా బోనస్ రూ.500 ఉండగా, రైస్ మిల్లర్లు మాత్రం కేవలం రూ.2,300 నుంచి రూ.2,400 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిల్లర్లు సిండికేట్ అయ్యి వడ్లు కొనకుండా ధర తగ్గిస్తూ దోచుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ లోడ్లతో వచ్చినందున కిరాయిలు మీద పడుతుండడంతో అడిగిన కాడికి ధాన్యం అమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో రైతులు ఎక్కువగా హైబ్రిడ్ వరి వంగడాలైన సన్న రకం ధాన్యం పండిస్తారు. ముందుగా నాటు పెట్టిన పొలాలకు సంబంధించి కోతలు మొదలు కాగా, చేతికి పంటను రైతులు మిర్యాలగూడలోని రైస్ మిల్లులకు తీసుకొస్తున్నారు. కాగా, మిల్లర్లు సిండికేట్ అయ్యి నరకం చూపిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వరి పంటను రైతులు సహజంగానే కోత మిషన్ల ద్వారా కోయడం ద్వారా ధాన్యంలో స్వల్పంగా తాలు గింజ కనపడుతుంది. తేమ శాతం ఉంటుంది. మిల్లర్లు ఈ ధాన్యం కొనుగోలు చేసి డ్రై చేసి నిల్వ పెట్టుకోవడం ఎప్పుడూ జరిగేదే. కానీ.. మిల్లర్లు తేమ, తాలు శాతం ఎక్కువ ఉందని కొర్రీలు పెట్టి తక్కువ ధరకు ధాన్యం అడుగుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే నీ ఇష్టం ఉన్న చోట అమ్ముకోపో అంటూ బెదిరిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. దాంతో చేసిదిలేక అడిగిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్యాలగూడలో రైస్ మిల్లు వద్ద రైతులు తీసుకువచ్చిన ధాన్యం లోడ్లు

వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు ధాన్యం లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌ను 15 మిల్లులకు తిరిగినా తక్కువ ధరకు అడుగుతున్నట్లు తెలిపారు. ధాన్యం మంచిగా ఉన్నా సిండికేట్ అయ్యి రేటు పెట్టడం లేదని వాపోయారు.

నకిరేకల్ మండలం తోకబావిగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి అనే రైతు రెండు లోడ్ల ధాన్యం తీసుకొచ్చి పదికి పైగా మిల్లులు తిరిగారు. అయినా ఎవరూ కొనుగోలు చేయడం లేదని దిగాలుగా ఓ మిల్లుల వద్ద లోడ్ ట్రాక్టర్లతో కనిపించారు. అధికారులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని తెలిపారు.

మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన ఒక రైతు ఒకే పొలానికి చెందిన ధాన్యాన్ని మొదటి రోజు తీసుకొస్తే రూ.2470 ధర పెట్టారు. రెండో రోజు రూ.2,440, మూడో రోజు రూ.2,400కి కొనుగోలు చేసినట్లు తెలిపారు. నానా కష్టాలు పడి పండించిన ధాన్యం అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం మిల్లుల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

15మిల్లులు తిరిగినా పడిగాపులే

నేను ఐదెకరాల్లో సన్నరకం వడ్లు పండించాను. ధాన్యం బాగుంది. రెండు ట్రాక్టర్లలో గురువారం ఉదయం మిల్లుకు తీసుకొచ్చాను. 15 మిల్లులకు తిరిగినా తాలు సాకు చెప్పి ఎవరూ ధాన్యం తీసుకోలేదు. ఒకవైపు ట్రాక్టర్ కిరాయిలు పెరిగిపోతున్నాయి. మరోవైపు ఎండకు గోస తీస్తున్నాం. వడ్లు ఎలాగైనా అమ్ముకోవాలని మిల్లు దగ్గరే పడిగాపులు గాస్తున్నా. అధికారులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదు. వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. ఇప్పుడే మిల్లర్లు ఇట్ల ఇబ్బంది పెడితే.. కోతలు ముమ్మరమైతే పరిస్థితి ఏంటి? ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయమైన గిట్టుబాటు ధర ఇప్పించాలి.

-నరేశ్‌రెడ్డి, రైతు, నకిరేకల్

ఒక్కటే పొలంలో పండించిన పంటకు రెండు తీర్ల ధరలా?

నాకు ఆరెకరాల పొలం ఉంది. కోత మిషన్ దొరకకపోవడంతో రెండు రోజులు వరి కోశాను. మొదటి రోజు తెచ్చిన వడ్లకు రూ.2,310, రెండో రోజు రూ.2,360కు కొనుగోలు చేశారు. ఒకే పొలంలో పండించిన ఒక్కటే రకం వడ్లకు ధరలో తేడా ఎందుకు? ఐకేపీ కేంద్రాల్లో మద్దతు రూ.2,320. బోనస్ 500 కలిసి రూ.2820 ఇస్తుంటే రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారు. అధికారులు మాత్రం మిల్లుల వైపు కన్నెత్తి చూడడం లేదు.

- యాదయ్య, రైతు, తిప్పర్తి

సిండికేట్ అయ్యి ధర తగ్గిస్తున్నారు

మా ఊరి శివారులోనే రైస్ మిల్లులు చాలా ఉన్నాయి. ఈ మిల్లుల కాలుష్యం వల్ల మేం చాలా ఇబ్బందులు పడుతున్నాం. అయినా కనికరం లేని మిల్లర్లు మా ధాన్యం కూడా కొనుగోలు చేయడం లేదు. నా పొలంలో పండించిన ధాన్యం అమ్ముకుందామని గురువారం లోడ్ తీసుకుని వచ్చాను. రెండు రోజులైంది. ఎవరూ తీసుకోవడం లేదు. మిల్లర్లు సిండికేట్ అయ్యి కావాలనే ధాన్యం తీసుకోకుండా ధర తగ్గించాలని చూస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

-పి.శ్రీను, రైతు, శెట్టిపాలెం

యాదగిరిగుట్ట: పెద్దకందుకూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

కార్మికులు మెచ్చే వేతన ఒప్పందం సాధిస్తాం

- బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి 21 : రాబోయే పాతికేండ్ల పాటు కార్మికులు మెచ్చే వేతన ఒప్పందాన్ని తీసుకువస్తామని బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి హామీనిచ్చారు. మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో శుక్రవారం ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ లిమిటెడ్(పీఈఎల్) బీఆర్ఎస్‌కేవీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు దఫాలుగా గతంలో ఏ కార్మిక సంఘమూ సాధించలేని విధంగా గొప్ప వేతన ఒప్పందాన్ని తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్‌కేవీదేనన్నారు. కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.60 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగాన్ని సాధించామని గుర్తుచేశారు. 2023లో చంద్రుడిపైన అడుగు పెట్టిన చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్‌లో ఉపయోగించిన జీఎస్ఎల్‌వీ మార్క్-3లో ఎస్-200 బూస్టర్‌ను అందించిన పీఈఎల్ కంపెనీ కార్మికుల పాత్రను అభినందించారు. ఇస్రో చేసిన ఎన్నో ప్రయోగాలకు సాలిడ్ ప్రొపలెంట్ బూస్టర్‌ను అందించేందుకు కూడా కృషి చేశారని తెలిపారు. ఈ నెల 29న జరిగే కంపెనీ అధికారిక కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌తో కలిసి పోటీలో దిగుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కేవీలో 140 మంది, బీఎంఎస్‌లో 93 మంది కార్మికులు ఉన్నట్లు చెప్పారు. కార్మికులు ఆలోచించి అండగా నిలిచే బీఆర్ఎస్‌కేవీ 'బాణం' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం జనరల్ సెక్రటరీ బరిగెల నర్సింహులు, వర్సింగ్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, ఉప కార్యదర్శి పాపయ్య, ఉపాధ్యక్షుడు గట్టి కొప్పుల లక్ష్మీనర్సయ్య, కోశాధికారి గవ్వల రమేశ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, నాయకులు గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, సీస రమేశ్‌తోపాటు, బీఆర్ఎస్‌కేవీ నాయకులు పాల్గొన్నారు.